# బుఫే భోజనాలు

- కాశీనాధుని రాధ

సన్నాయి మేళాలతో, మామిడాకుల తోరణాలతో, రంగురంగుల పూలదండలతో చేసిన అలంకరణలు, అంతకుమించిన రంగుల హరివిల్లులలాంటి ముగ్గులతో కళ్యాణ మండపం వెలిగిపోతోంది. ఏదో కనులవిందుగా కనబడుతున్నవి చూసి ఆనందిచచ్చుగా నావక్రబుద్ధి మెదడంతా పాకి పిచ్చిపిచ్చి "కంపారిజన్లు" చేసేస్తోంది. ఇలా మనం అమెరికాలో చేయించుకోవాలంటే ఎన్నివేల డాలర్లు కుమ్మరించాలో. ఏవైనా భోగం అంటే వీళ్ళది... అని పరిగెడుతున్న ఆలోచనలు సడన్ స్క్వీకీ బ్రేకుతో ఆగిపోయాయి. పుత్రరత్నం "Mom, I am hungry" అని దీర్ఘమైన రాగం తీస్తుంటే. వెళ్ళి మీనాన్నని పిలు అన్నా శ్రీవారు ఏ రౌండ్ టేబుల్ దగ్గర స్పీకర్ డ్యూటీ లో వున్నారా అని పరకాయించి చూస్తూ.. ఇకనేం కనబడ్డారు. కాస్త దగ్గరిగా వెళ్ళి ఏవండీ అక్కడ బ్రేక్ ఫాస్టు అయిపోతోంది పిల్లలని తీసుకుని కదలండి అన్నా.

సరే అందరం డైనింగ్ ఏరియాకి వెళ్ళేము. అతిరధులు మహారధులలాగ కొంతమంది on duty staff మాసిన నీలం చొక్కాలేసుకుని ట్రేలలోని వస్తువులు ఒక దాంట్లోంచి మరో దానిలోకి పోసేస్తూ హడావుడిగా వున్నారు. ఇంతలో మావారి ధర్మసందేహం. మనం మగపెళ్ళివాళ్ళం కదా ఆడపెళ్ళివారు ప్రత్యేకించి పిలిచి వడ్డించరా? అంటూ.... చదవేస్తే వున్న మతీ పోయిందన్నట్టుంది మీ వ్యవహారం. ఇది 21st century నా మజాకానా అంతా buffet .... కాదు కాదు బుఫే స్టయిలండీ అన్నా నవ్వుతూ.

ఈ మాత్రం భాగ్యానికేనా మాఅక్కయ్య కొడుకుపెళ్ళికి పిల్లలూ మీరూ కూడా వస్తే బోలెడంత సరదాగా వుంటుందండీ అంటూ సొదపెట్టి మరీ ప్రయాణం కట్టించావు అని మొదలెట్టారు. మావాగ్యుద్ధం ఎంత దూరం వెళ్ళేదో తెలియదుకాని ఈ లోపున ఉప్మా, సాంబారు తప్ప తక్కినవి అయిపోయాయని జనాలు గట్టిగా మాటాడేసుకుంటున్నారు. పొద్దుట hotel room నుంచి బయలు దేరే టప్పటినుంచి ఇడ్లీ, వడ, కొబ్బరి పచ్చడి సాంబారు అంటూ ఉత్సాహంగా వచ్చిన మావారికి ఒళ్ళు మండింది. ప్రొద్దుట వేళైపోతోంది అని room service కూడా వద్దని ఇక్కడకి లాక్కొచ్చావు. అంటూ గొణగడం మొదలెట్టారు. మీసణుగుడు చాలించి లైనులో నిలబడండి లేకపోతే ఉప్మాకూడా దక్కదు అన్నా. బోలెడంత కుమ్ములాటలూ, మోచేతి యుద్ధాలూ అయి రెండు పళ్ళాల్లో కాస్త ఉప్మా సంపాదించే టప్పటికి తల ప్రాణం తోక్కొచ్చింది. పిల్లలూ ఆయనా తింటుండగా ఇంద కాఫీ తీసుకోండి అంటూ అందిచ్చా... యదాలాపంగా అందుకున్న ఈయన వేడి కాఫీ చేతిమీదంతా పోసుకున్నారు. ఈ కప్పులేవిటి ... మగ్గమ్మీద నేసిన సన్నటి ఉల్లి పొరలాటి చీరని అగ్గిపెట్టేలో పెట్టారని చరిత్రలో చదివా. ఈ కప్పుల్ని కనిపెట్టిన వాళ్ళు తిరిగి చరిత్ర రాసేస్తున్నారోయ్ అన్న మావారి కామెంటుకు నవ్వుకుంటూ ఉండండి మరో కప్పు తెస్తా ఈ మాటైనా జాగ్రత్తగా పుచ్చుకోండి అంటూ కదిలా.

పది పదిహేనేళ్ళుగా ఇండియాలో జరుగుతున్న పెళ్ళిళ్ళూ పేరంటాలూ చూడని మావారికి ఈస్క్రీన్ ప్లే ఏవీ నచ్చలా. ఇదిగో లాస్టు టైమ్ వరవిక్రయం పుస్తకం చూసినప్పుడు మగపెళ్ళివారికి, వారి పిల్లా, మేకా, గొడ్డూ గోదాకి అతిమర్యాదగా వడ్డించి తినిపించాక ఆడపెళ్ళివారు తినాలని చూసా. ఇదేం గొడవ ఈ పెళ్ళివారు డొక్క మాడుస్తున్నారు . ఇండియా పెళ్ళికొచ్చి, చక్కగా వడ్డిస్తుంటే కూర్చుని భోజనం చెయ్యచ్చనుకున్నా. స్వర్గానికెళ్ళినా సవతి పోరు తప్పలేదన్నట్టు ఈ బుఫేలేంటి? మీ అక్కయ్యగారికో, అన్నయ్య గారికో చెప్పి భోజనాల టైముకైనా కాస్త కూచ్చో బెట్టి వడ్డించే ఏర్పాట్లు చేయించమందు తల్లీ! నీకు పుణ్యంవుంటుంది.

ఇలా చిప్పలు పట్టుకుని తినలేక చస్తున్నా అంటూ మొదలెట్టారు పట్టువదలని విక్రమార్కుడిలాగ వారు. సరే కనుక్కుంటాలెండి ఏదో నలుగురితో నారాయణా అనకుండా మీ హిరణ్యాక్షవరాలూ మీరూనూ అన్నా.

మళ్ళీ సమావేశపు టేబుళ్ళదగ్గరకి నడుస్తుంటే మా మేనమావ ఏంవైందమ్మా! అని అడిగారు. అంతే మళ్ళీ మొదలయింది వరవిక్రయాలు, వాళ్ళ పెద్దక్కయ్య పెళ్ళి కబుర్లు, వాళ్ళ బాబాయిగారి అమ్మాయి పెళ్ళి కబుర్లు .. ఎలాంటి భోజనాలో, ఎంత సరదానో వర్ణించడం మొదలెట్టారు. మా మావయ్యేవీ తక్కువ తినలేదు. మొత్తానికి అగ్నికి ఆజ్యం తోడయినట్టు ఇద్దరు పెళ్ళిళ్ళలో సరదాలు సంబరాలు లేకుండా ఎంత యాంత్రికంగా జరిగిపోతున్నాయో అంటూ ఈ కాలం పద్ధతుల్ని ఆడవాళ్ళు కాక పోయినా ఆడి పోసేసుకున్నారు సరే నేను నా mission impossible ని possible ఎలా చెయ్యాలా అనుకుంటూ మాఅక్క దగ్గరికి వెళ్ళా. మా ఆయన వడ్డనలు లేవేంటని గొడవ పెట్టేస్తున్నారు ఆడపెళ్ళి వారిని అడిగి చూడవే అంటూ... మొత్తానికి మా అక్కయ్య ఆడపెళ్ళివారితో మాట్లాడి ఓ పాతికమంది దాకా ముఖ్యమైన మగ పెళ్ళివారికి వడ్డనలు చేయించే యేర్పాటు చేసింది. ఇంత చేసినా ప్రాప్తం వుండాలిగా.... పెళ్ళికి వచ్చిన తన తాలూకు చుట్టాలతో కలిసి బుఫే భోజనమే గతియింది పాపం మావారికి.

మర్నాడు మరొక పెళ్ళి. మాబావగారు గుడివాడమనిషి ఈ పట్నవాసం స్టయిళ్ళొది లేసి చక్కగా పద్ధతిగా చేస్తారు చూడు అన్నారు. కళ్యాణ మంటపం చేరుకునే సరికి బాగా లేటయింది. ఇవాళ మావారు పంట్లాం మీద ఒక ఇండియన్ స్టయిలు చొక్కా తొడిగి అక్కినేని నాగేశ్వరరావులాగ ఒక శాలువా భుజానవేసి మరీ వచ్చేరు. సరిగ్గా పెళ్ళి వేళకి చేరుకున్నాం. పెళ్ళయిన ఒక అరగంటకి భోజనాలకి లేవండి

అన్నారు. అంతే గాలి దుమారంలా జనాలు భోజనాల హాలులోకి పరుగులు తీయడం మొదలెట్టారు. మావారేమో "వివాహ భోజనంబు వింతైన వటకంబు" తీరులో నిదానంగా కదులుతున్నారు. వాళ్ళ బావగారు పదండి పదండి అంటూ తొందర చెయ్యడం మొదలెట్టారు. అదేంటి బావగారూ మీరు చేసిన ఏర్పాట్లే కదా మీ కెందుకు కంగారు అన్నరీయన. హాల్లో రెండు వైపులా టేబుళ్ళు వేయించి సర్వ్ చేయిస్తున్నానోయ్ అందరం లైనులో నుంచోవాల్సిందే ఆల్ట్రామోడరన్ స్టయిలంతా మీసొత్తే అనుకుంటారు మీ అమెరికా వాళ్ళు. మీకే కాదోయ్ మాకూ స్టయిలుంది బుఫే ఏర్పాటు చేసాం గ్రాండ్ గా అని వాళ్ళ బావగారు మీసం మెలేసి మరీ చెబుతుంటే మావారు ఏం మాట్లాడాలో తెలీక తెల్ల మొహం వేసారు.

సరే ఇక చేసేదేముంది రోట్లో తలెట్టాక రోకటి పోటుకి వెరిస్తే ఎలా మరి. ధైర్యే సాహసే లక్ష్మీ అనుకుంటూ పద్మవ్యూహంలోకి ప్రవేసించే అభిమన్యుల్లాగా కదిలాం. మునుకులతో పొడిపించుకుని, పళ్ళాలతో మొట్టి కాయలు తిని, పదార్థాలని చేరుకుని నీరుగారి పోయారు మావారు. గోంగూర పప్పేది, గుమ్మడికాయ కూరేది, పెరుగుపచ్చడేమైంది పద్మా! ఈ ఎండిన రొట్టెముక్కలూ, దాల్ మఖీనీలు, పాలక్ పనీర్లు వచ్చేసేయేంటి. మనం wrong డయినింగ్ హాల్లో ఉన్నట్లున్నాం. అంటున్న మావారిని మోచేత్తో పొడిచి కాస్తమాట్లాడటం కట్టిపెట్టి తోచింది తీసుకునడవండి లేదంటే ఈ భారతీయ ప్రజానీకం మనం ఏ అండమాన్ దీవులనుంచో దిగామనుకుంటారు అని వార్నింగ్ ఇచ్చా.

పెళ్ళి భోజనాలయి వెనక్కి వెళుతుండగా నాకు ఆవేశం వచ్చేస్తోంది పద్మా! కవిత్వం రాసెయ్యల్సిందే అన్న మావారితో శుభం. అలాగే కానివ్వండి మహాప్రభో! ఇంటికెళ్ళాక గుత్తివంకాయకూర, మామిడికాయ పప్పు, పెరుగు పచ్చడి చేసి పెడతాగాని ఇంక గొడవ పెట్టకండి అన్నా. ముందే చెప్పాకదా మావారు పట్టువదలని విక్రమార్కుడని రాసేసేరు కవిత బుఫే భోజనాలమీద.

"లక్షల ఖర్చెట్టి ఖుఫేల పెట్టి
భిక్షపాత్రల బోలు ప్లేట్లు పట్టి
ఇంటింట దండిన బిచ్చగానికి వోలె
అన్ని వంటకముల నొక ముద్ద జేసి
తినవలసి వచ్చెగద ఈ నాటి పెళ్ళిళ్ళ
కాల మహిమ నేమంచు వచియింతు
మన కర్మ మిటులాయె రామరామ". అంటూ

మన అమ్మాయి పెళ్ళి కి మాత్రం నో బుఫే భోజనాలు that's final అని ఒక శపథం కూడా చేసేసారు. "sure start working on it" అన్నా. ఇక జరగబోయేది మీకే కాదు నాకు కూడా సస్పెన్స్ స్టోరీనే. కధ జరిగేక చెప్పాలి కదా. మరి మళ్ళీ కలుద్దాం.

*****